ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 345 | పేజీలు: 6 | వెల: రూ.3/- | బుధవారం 25 మార్చి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి



## మతం మారితే ఎస్సీ హోదా రద్దు

**ఎస్సీ, ఎస్టీ చట్టంతో రక్షణ పొందలేరు**

**హిందూ, బౌద్ధవం, సిక్కులు మారితే వర్తింపు**

**సుప్రీంకోర్టు సంచలన కీలక తీర్పు**

**గతంలో రాష్ట్ర హైకోర్టు తీర్పునకు సమర్థన**

**న్యూఢిల్లీ, మార్చి 24 (ప్రభాత ఉదయం)**

మత మార్పిడిలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సీ హోదా రద్దు అవుతుందని స్పష్టం చేసింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాలు కాకుండా ఇతర మతంలోకి మారినా ఎస్సీ హోదా రద్దు అవుతుందని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియాతో కూడిన ధర్మాసనం క్లారిటీ ఇచ్చింది. క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్ అయిన వ్యక్తి ఎస్సీఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని భారత సర్వోన్నత న్యాయస్థానం క్లారిటీ ఇచ్చింది. గతంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. క్రైస్తవ మతంలో లేదు కుల వ్యవస్థ లేదని, మతం మార్చుకున్న వెంటనే ఎస్సీ ..మిగతా 2లో

## కేసీఆర్‌తో ఎటువంటి వ్యక్తిగత కక్షలు లేవు

**కేసీఆర్‌తో నాకున్న బంధం ఇదే.. సీఎం రేవంత్ కీలక కామెంట్స్**

**న్యూఢిల్లీ, మార్చి 24 (ప్రభాత ఉదయం)**

కేసీఆర్ నాకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమే.. వ్యక్తిగత శత్రువు కాదని సీఎం రేవంత్ అన్నారు. బీఆర్ఎస్ అధినేత ఇంట్లోని వారసత్వ పో నడుస్తుందని ఆరోపించారు. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా అటు బీఆర్ఎస్‌ను, ఇటు బీజేపీని ఓడించి.. రాబోయే పదేళ్ల కాలం తనదేనని రేవంత్ వ్యాఖ్యానించారు.

కేసీఆర్ కుటుంబంపై సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో టీవీ9 వాట్ ఇండియా థింక్స్ టుడే సదస్సులో పాల్గొన్న ఆయన.. కేసీఆర్‌తో తనకు ఎటువంటి వ్యక్తిగత కక్షలు లేవని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ చీఫ్ కేవలం రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని అన్నారు. కేసీఆర్ కుటుంబంలో పదవుల కోసం అంతర్గత యుద్ధం జరుగుతోందని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. "కేసీఆర్ ఎదుర్కొంటున్నది రాజకీయ సమస్య కాదు, అది పూర్తిగా వారి కుటుంబ సమస్య. పదవుల కోసం కేటీఆర్, కూతురు పోటీ పడుతున్నారు. గతంలో హరీష్ రావు ముఖ్యమంత్రి అవుతారన్న చర్చ కూడా అందుకే వచ్చింది" అని విమర్శించారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై కేటీఆర్ మాట్లాడితే, బడ్జెట్‌పై హరీష్ రావు మాట్లాడుతున్నారని.. వారి మధ్య సమన్వయం లేదని వేలెత్తి చూపారు.

బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో ఉనికి కోల్పోతోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుండు సున్నా వచ్చిందని, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కూడా ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సమయంలో కేటీఆర్ బెట్టింగులు కట్టించారని, అయినా అక్కడ ఓటమి తప్పలేదని రేవంత్ ఆరోపించారు. "నా లెక్క ఎప్పుడూ ఒకటే.. ఒక దెబ్బకు రెండు పిట్టలు.. వచ్చే ఎన్నికల్లో అటు బీఆర్ఎస్‌ను, ఇటు బీజేపీని రెండింటినీ ఓడించి తీరుతాం" అని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉన్న సంప్రదాయం ప్రకారం.. ప్రజలు తనకు 2024 నుంచి 2034 వరకు అవకాశం ఇస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం కేసీఆర్ కనీసం ప్రతిపక్ష పాత్రనైనా సరిగ్గా పోషించాలని హితవు పలికారు.




## ఢిల్లీ మెట్రో, అసెంబ్లీలకు బాంబు బెదరింపులు

**ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బెదిరింపు మెయిల్**

**మోడీ, అమిత్ షా, జైశంకర్‌లను కూడా లేపేస్తామని హెచ్చరిక**

**న్యూఢిల్లీ,మార్చి24 (ప్రభాత ఉదయం)**

దేశంలోని ప్రముఖులను హతమారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు ఒక బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో ఈ అంశంపై భద్రతా సిబ్బంది, అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టారు. మంగళవారం తనకు బెదిరింపు మెయిల్ వచ్చిందని స్పీకర్ విజేందర్ గుప్తా అధికారులకు తెలిపారు. దేశంలోని ప్రముఖులను హతమారుస్తామని పేర్కొంటూ ఆ మెయిల్ వచ్చింది. అందులో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఢిల్లీ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సందు వంటి ప్రముఖుల పేర్లు ఉన్నాయి. అలాగే ఢిల్లీ అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్‌లకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. దీనిపై సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది, అధికారులు వెంటనే అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్లలో బాంబ్ స్క్వాడ్‌తో, డిస్పోజబుల్ టీమ్స్‌తో తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణం, మెట్రో స్టేషన్ పరిసరాల్ని క్షుణ్ణంగా ..మిగతా 2లో





### పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు....

## నేడు అఖిలపక్షంతో ప్రభుత్వం భేటీ ?

**న్యూఢిల్లీ,మార్చి24 (ప్రభాత ఉదయం)**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల అంశంపై సమీక్ష నిర్వహించే నేపథ్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా అంశంపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగించిన విషయం తెలిసిందే. సోమవారం లోక్‌సభలో, ఇవాళ రాజ్యసభలో ఆయన ప్రసంగించారు. ఇరాన్ సంక్షోభం వల్ల ప్రపంచవ్యాప్తంగా దీర్ఘకాలిక ప్రభావం పడే అవకాశాలు ఉన్నట్లు లోక్‌సభలో మోదీ అన్నారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ధీటుగా ..మిగతా 2లో





## విజయవాడ ఉగ్ర కుట్ర భగ్నం

**ముగ్గురు యువకులు అరెస్టు**

**ఐసిస్, అఖీస్ లతో సంబంధాలు**

**విజయవాడ మార్చి 24 (ప్రభాత ఉదయం)**

విజయవాడలో పెను ఉగ్ర కుట్రను కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ అధికారులు భగ్నం చేశారు. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలైన ఐసిస్, ఆఖీస్ లతో సంబంధాలు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిని మహమ్మద్ రహమతుల్లా షరీఫ్, ఎండి. డానిష్ , మీర్జా సోహైల్ బేగ్‌లుగా గుర్తించారు. దేశంలో అశాంతిని సృష్టించేందుకు వీరు రహస్యంగా కార్యకలాపాలు సాగిస్తున్నట్లు నిఘా వర్గాలు నిర్ధారించాయి. అరెస్టైన యువకులు ..మిగతా 2లో

## రాజకీయాల్లో నాది ముళ్ల బాట

**తనను పార్టీలో కావాలనే దూరం పెట్టారన్న ఆవేదన**

**జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం**

**పార్టీ వీడొద్దని కోరిన మహేశ్ గౌడ్**

**నిర్ణయం ఎవరి చేతుల్లోనూ లేదన్న జీవన్ రెడ్డి**

**నేడు పార్టీ కార్యకర్తలతో భేటీకి పిలుపు**

**జగిత్యాల,మార్చి24 (ప్రభాత ఉదయం)**

తన పదేళ్ల ఒంటరి పోరును పార్టీ అధిష్ఠానం చిన్నచూపు చూసిందని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పీసీసీ చీఫ్ పదవి రాకున్నా.. పార్టీ అధికారంలోకి వచ్చినందుకు సంతోషపడ్డానన్నారు. మంగళవారం జగిత్యాలలోని తన నివాసానికి పార్టీ అధిష్ఠానం పంపిన దూతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశం అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో తనది పూలబాట కాదని.. ముళ్ల బాట అని స్పష్టం చేశారు. పీసీసీ చీఫ్ కాబట్టి రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి, సీఎల్పీ లీడర్ కాబట్టి భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారన్నారు. కానీ తాను శాసన మండలిలో నేతను అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి గుర్తు చేశారు. మరి తనకెందుకు అన్యాయం చేశారంటూ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలను ఈ సందర్భంగా జీవన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల్లో మనకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదర్శం కాదు కదా? అంటూ కాంగ్రెస్ నేతలకు ఆయన చరకలంటించారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనలు ఏమిటి? మనం చేస్తున్నదేమిటంటూ రాష్ట్రంలోని పార్టీ నేతలను ఈ సందర్భంగా ఆయన సూటిగా నిలదీశారు. పార్టీ ..మిగతా 2లో



## పార్లమెంటులో వైసిపికి 11వ నంబర్ గది

**కంగారుతో మార్చాలని స్పీకర్‌కు వినతి**

**12 నంబరు కేటాయిస్తూ ఆదేశాలు**

**న్యూఢిల్లీ,మార్చి24 (ప్రభాత ఉదయం)**

ఢిల్లీలోని పార్లమెంటు భవనంలో గదుల కేటాయింపు వ్యవహారం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, '11' అనే సంఖ్యకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధం ఈ ఘటనతో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. కొత్త పార్లమెంటు భవనంలో ఆయా పార్టీల బలాబలాలను చూసి స్పీకర్ కార్యాలయం ..మిగతా 2లో



# రాజకీయాల్లో నాది ముళ్ల బాట

మొదటి పేజీ తరువాయి...

జాతీయ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ వంటి నేతలు ఇచ్చిన హామీ అమలు కాకపోతే పార్టీ ఎందుకంటూ జీవన్ రెడ్డి ఈ సందర్భంగా కొంత అసహనం వ్యక్తం చేశారు. అధిష్ఠానం తనను బుజ్జగించలేదని చెప్పారు. తాను పార్టీ వీడి వెళ్తున్నానని తెలిసి.. అలా వచ్చి వెళ్లారంటూ కాంగ్రెస్ ప్రతినిధుల రాకపై జీవన్ రెడ్డి స్పందించారు.కాంగ్రెస్ పార్టీని వీడొద్దని మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కోరామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్‌రెడ్డితో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సాకేవత్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర, 43 ఏళ్ల అనుభవం ఉన్న నాయకుడు జీవన్‌రెడ్డి. ఆయన మాకు తండ్రిలాంటివారు. రాజకీయాల్లో ఆయన సీనియర్ నేత. జీవన్‌రెడ్డిని కొన్ని ఇబ్బందులకు గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఆయన్ను వదలుకోదలచుకోలేదు. పార్టీ వీడే అంశంలో పునరాలోచన చేయాలని కోరాం అని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్ రెడ్డితో పీసీసీ అధ్యక్షులు మహేష్ భేటీ ముగిసింది. పార్టీలో కొనసాగండి, పార్టీని వీడకండి. భవిష్యత్తుపై చర్చిద్దామని పీసీసీ చర్చలు జరిపారు. ఏఐసీసీ నాయకులు సైతం పార్టీలోనే కొనసాగాలని జీవన్ రెడ్డిని కోరారు. భేటీ అనంతరం మహేష్‌గౌడ్ మాట్లాడారు. 'జీవన్ రెడ్డి మా తండ్రి



సమానులు. 43 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. రాష్ట్రంలో అంతకన్నా సీనియర్ నాయకులు లేరు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొంత ఇబ్బంది పడ్డారు. ఈ వయసులోనూ ఇబ్బంది పడ్డారు. కొన్ని సార్లు రాజకీయంలో అనుకోని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. జీవన్‌రెడ్డి ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టి నా సూచనల మేరకు మంత్రి శ్రీధర్ బాబు వచ్చారు. నేను కూడా ఈ రోజుల కలిశాను. కాంగ్రెస్‌తో అనుబంధాన్ని తెంచొద్దని, మమ్మల్ని వీడొద్దని వారికి విన్నవించడం జరిగింది. కార్యకర్తల ఒత్తిడి తదితర కారణాల వల్ల వారు ఈ నిర్ణయం తీసుకుంది. వారు పార్టీలోనే ఉండాలని ఏఐసీసీ పట్టుబడుతోంది. నాకు జీవన్‌రెడ్డితో 1986 నుంచి పరిచయం. అప్పటి నుంచి మాకు రాజకీయంగా సలహాలు ఇచ్చారని తెలిపారు. జీవన్ రెడ్డి రాజీనామా చేయరు అనే ఆశతో ఇక్కడి నుంచి వెళ్తున్నామని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు.అయితే వారు ఎలాంటి హామీ ఇవ్వలేక పోయారు. దీంతో ఆయనకు సూచనలు చేసి వెనుదిరిగారు. పార్టీ మారడామా లేదా అన్నది కూడా తన చేతిలో లేదని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి వ్యాఖయానించారు. ఇప్పటికే శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌లు ఓమారు జీవన్ రెడ్డితో భేటీ అయ్యారు. ఇక ఈ భేటీ అంనంతరం ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ఈ చర్చలు ఫలించలేదు. జీవన్‌రెడ్డి ఇంటిపై ఉన్న కాంగ్రెస్ ప్లేక్సీని అభిమానులు తొలగించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇది పరిష్కారం లేని సమస్యగా మారింది.. సమస్యకు పరిష్కారం నా దగ్గర లేదు.. వారి దగ్గర కూడా లేదు. రేపు 10 గంటలకు కార్యకర్తలు అందరు భేటీ అవ్వండి. గార్డెన్‌కి రండి.. రేపు భవిష్యత్తు, పయనం ఎలా ఉంటుందో తెలియదు.. కాంగ్రెస్ పార్టీలో ఉండి స్వపక్షంతో యుద్ధం నేను చేయలేను. నేను నా నిర్ణయం రేపు ప్రకటించబోతున్న.. నా నిర్ణయం దైవ నిర్ణయంగా భావిస్తున్నా.' అని జీవన్‌రెడ్డి తెలిపారు. ఇక కాంగ్రెస్‌కు రేపు జీవన్‌రెడ్డి రాజీనామా చేయనున్నట్లు తెలుస్తోంది.



# ఢిల్లీ మెట్రో, అసెంబ్లీలకు బాంబు బెదరింపులు

మొదటి పేజీ తరువాయి...

తనిఖీ చేస్తున్నారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ప్రాంతం మొత్తం హై అలర్ట్ కొనసాగిస్తున్నారు. అయితే, ఇలాంటి బెదిరింపులు రావడం సహజమే అని, అలాగని వాటిని తేలిగ్గా తీసుకోలేమని, అందుకే భద్రతను కట్టుదిట్టం చేశామని ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ట్ అన్నారు. ఈ బెదిరింపులపై తామేమీ భయపడటం లేదని, అసెంబ్లీ సమావేశాలు యథావిధిగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని, భద్రత విషయంలో ఎలాంటి ఆందోళనా అవసరం లేదని బీజేపీ ఎమ్మెల్యేలు అన్నారు. ఇక ఢిల్లీ అసెంబ్లీలో బ్జడెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా సీఎం రేఖా గుప్తా కూడా అసెంబ్లీకి చేరుకున్నారు. బెదిరింపు ఈ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు అధికారులు ఆరాతీస్తున్నారు.



డీజీపీ శివధర్ రెడ్డి ని కలసి వినతి పత్రం అందచేస్తున్న గోనె సాల్మన్ రాజు

# గుడ్ ఫ్రైడే, ఈస్టర్ ప్రార్ధనల సందర్భంగా ప్రార్ధనలు, ర్యాలీలకు అనుమతులు ఇవ్వాలి

**బుద్వేల్, మార్చి 23 (ప్రభాత ఉదయం) :**

రాష్ట్ర వ్యాప్తంగా క్రైస్తవులు జరుపుకునే ర్యాలీలకు అనుమతితో పాటు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్ రాజ్ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గోనె సాల్మన్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ నెల 29న మట్టల ఆదివారం,ఏప్రిల్ 3న గుడ్ ఫ్రైడే ఆరాధన,4వ తేదీ ర్యాలీలు ,5వ తేదీన ఈస్టర్ ఆరాధన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో బిషప్ లు , పాస్టర్లు, సువార్తికులు పాల్గొంటారని, ర్యాలీల నిర్వహణతో పాటు ప్రత్యేకంగా జరిగే ప్రార్ధన సమయాలలో సైతం పోలీస్ బందోబస్తు ఉండేలా స్థానిక పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. డీజీపీ శివధర్ రెడ్డి సానుకూలంగా స్పందించి కార్యక్రమాలు శాంతియుత వాతావరణంలో జరిగే చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారని గోనె సాల్మన్ రాజ్ తెలిపారు. తాము చేసిన విజ్ఞప్తికి డీజీపీ శివధర్ రెడ్డి స్పందించినందుకు క్రైస్తవుల పక్షాన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు బిషప్ తిమోతీ, రెవరెండ్ మెన్నో జోయల్, రెవరెండ్ జయకుమార్, సి.హేమలత, ఎం. షాలిని, ప్రబో ద్ విల్సన్, పాల్ ప్రదీప్ పాల్గొన్నారు.




# మత్తు పదార్థాల జోలికి పోవొద్దు... జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

**విద్యార్థులకు సూచించిన జగద్గిరిగుట్ట సి ఐ వెంకటేష్**

**కూకట్ పల్లి, మార్చి 24 (ప్రభాత ఉదయం)**

మత్తు పదార్థాల పట్ల చిన్ననాటి నుంచే అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు. స్థానిక రాజీవ్ గృహకల్ప లోని సంస్కృతి పాఠశాలలో జగ్గిరి గుట్ట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలిసి తెలియని వయసులో కొందరు మత్తు పదార్థాలకు బానిస అవుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీపం కాలుతుందని తెలిసి దానిని ఎవరు ముట్టుకోబోరని, అదేవిధంగా మత్తు పదార్థాల జోలికి కూడా పోవద్దని సూచించారు. సొసైటీలో నకిలీ వస్తువులు ఏ విధంగా అయితే లభ్యమవుతున్నాయో అదే స్థాయిలో మత్తు పదార్థాలు కూడా అందుబాటులో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని నియంత్రించడంలో పోలీస్ శాఖ కట్టు దిట్టమైన చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. యువత మత్తు పదార్థాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉ ందన్నారు. బాలికలు అన్ని విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తెలిసిన వ్యక్తులైన, తెలియని వ్యక్తులైన తమ పట్ల అనుచితంగా ప్రవర్తించినట్లయితే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. బాలికలకు రక్షణ కోసం షీ టీం లను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. సోషల్ మీడియా ప్రభావానికి అస్సలు గురి కావద్దని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సూచించిన విధంగా సత్ప్రవర్తనతో మెలగాలని సిఐ తెలిపారు. విద్యార్థులు సొసైటీ పట్ల బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. ఎవరైనా అపాయంలో ఉంటే వారికి తప్పకుండా సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు, కానిస్టేబుళ్లు, పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పార్లమెంటులో వైసిపికి

# 11వ నంబర్ గది

మొదటి పేజీ తరువాయి...

గదులను కేటాయిస్తుంది. అయితే వైసీపీ ఎంపీలకు కేటాయించిన గది నంబర్ వారిని తీవ్ర కలవరానికి గురిచేసింది. స్పీకర్ కార్యాలయం మొదట వైసీపీకి మొదటి అంతస్తులో 11వ నంబర్ గదిని కేటాయించింది. ఈ నంబర్ చూడగానే వైసీపీ ఎంపీలు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ కేవలం 11 స్థానాలకే పరిమితమైంది. సోషల్ మీడియాలో నెటిజన్లు వైసీపీని '11' అంటూ ఎద్దేవా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు పార్లమెంటులో కూడా అదే నంబర్ రావడం ఫ్యాన్ పార్టీ నేతలను విస్మయానికి గురిచేసింది. తమకు ఇచ్చిన గది నంబర్ మార్చాలని కోరుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ ఎంపీలు హుటాహుటిన స్పీకర్‌ను కలిశారు. 11వ నంబర్ గదిని ఎందుకు వద్దంటున్నారని స్పీకర్ ప్రశ్నించగా.. ఆ నంబర్ తమకు కలిసి రావడం లేదని, ఏపీలో తమ పార్టీ గెలిచిన సీట్ల సంఖ్య కూడా అదే కావడంతో అందరూ హేళన చేస్తున్నారని ఫ్యాన్ పార్టీ నేతలు వివరించారు. ఆ పార్టీ ఎంపీల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న స్పీకర్, వారికి 12వ నంబర్ గదిని కేటాయించారు. దీంతో వైసీపీ నేతలు ఊపిరి పీల్చుకున్నారు. రాజకీయాల్లో సంఖ్యాశాస్త్రం సెంటిమెంట్లకు ఎంత ప్రాధాన్యం ఉంటుందో ఈ ఘటన నిరూపిస్తోంది. ఒకప్పుడు 151 సీట్లతో రికార్డు సృష్టించిన పార్టీ, ఇప్పుడు '11' అనే అంకెను చూసి భయపడటం రాజకీయ విచిత్రమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, ఆంధప్రదేశ్‌లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి పార్లమెంటు మొదటి అంతస్తులో 9వ నంబర్ గదిని కేటాయించారు. కూటమి ప్రభుత్వంలో టీడీపీ కీలక పాత్ర పోషిస్తోండటంతో, ప్రధానమైన గదుల్లో ఒకటి వారికి దక్కింది.

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు....

# నేడు అఖిలపక్షంతో ప్రభుత్వం భేటీ ?

మొదటి పేజీ తరువాయి...

ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కోవిడ్‌ను ఎదుర్కొన్న రీతిలో రాబోయే రోజులకు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఇవాళ రాజ్యసభలో కూడా మోదీ ఈ అంశాలనే ప్రస్తావించారు. అన్ని వనరుల నుంచి గ్యాస్‌ను, క్రూడ్ ఆయిల్‌ను సమీకరించే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల తీవ్ర ఎనర్జీ సంక్షోభం ఏర్పడిందని, ఆ సంక్షోభాన్ని తట్టుకునే రీతిలో ప్రయత్నాలు జరుగుతున్నట్లు వెల్లడించారు. చర్చలు, దౌత్యం ద్వారా శాంతిని నెలకొల్పాలని భావిస్తున్నామన్నారు. యుద్ధ ఉద్రిక్తతలు తగ్గాలని, హోర్ముజ్ జలసంధిని ఓపెన్ చేయాలని ఆయన కోరారు. శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఒకవేళ పశ్చిమాసియా పరిస్థితులు సుదీర్ఘ కాలం కొనసాగితే అప్పుడు పరిస్థితులు భయానకంగా ఉంటాయన్నారు. భారత్ వద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నుల రిజర్వ్ ఇంధనం ఉన్నట్లు చెప్పారు. రాబోయే రోజుల ఆ సంఖ్యను 65 లక్షల మెట్రిక్ టన్నులకు చేర్చనున్నట్లు తెలిపారు. ఇంధన నౌకల తయారీ ప్రాజెక్టు కోసం సుమారు 70 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పారు.



రోబో రేస్ లో పాల్గొన్న విద్యార్థులు

# రోబో రేస్‌లో విద్యార్థుల ప్రతిభ

**రాజేంద్రనగర్, మార్చి 24 (ప్రభాత ఉదయం)**

టెకథాన్ 2.0 కార్యక్రమాన్ని వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో రోబోటిక్స్ క్లబ్, ఎఎస్ఎంఈ స్టూడెంట్ సెక్షన్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని వివిధ కళాశాలల నుంచి 100కు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్సీ రోబో రేస్ లో సీఎంఆర్, సీఎంఆర్టీసీ, ఎన్ఎన్ఆర్ఢీ, ఎస్ఎన్ఐఎస్టీ, నరసరావుపేట, ఎన్ఎస్ఆర్ఐటీ విశాఖపట్నం కళాశాలల నుంచి 30కి పైగా జట్లు పాల్గొన్నాయి. ఆర్సీ రోబో రేస్ లో నల్లా నర్సింహ్మారెడ్డి కాలేజ్ మొదటి బహుమతిని గెలుచుకుంది. వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాల రెండవ బహుమతి, సీఎంఆర్ కళాశాల మూడవ బహుమతిని గెలుపొందాయి. పిచ్-అ-థాన్ పోటీలో వాసవీ ఇం జనీరింగ్ కాలేజ్ మొదటి, మూడవ బహుమతులు గెలుచుకోగా, శ్రీనిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ రెండవ బహుమతిని గెలుచుకుంది. ఈ సందర్భంగా వాసవి ఇంజనీరింగ్ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎస్ వి రమణ నిర్వాహకులు, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి రామ్మోహన్ రావు, విద్యార్థి సమన్వయ కర్త, డాక్టర్ పి వి ఎస్ సుభాషిణి లు పాల్గొన్నారు.

## మతం మారితే

# ఎస్సీ హోదా రద్దు

మొదటి పేజీ తరువాయి...

హోదా రద్దు అవుతుందని హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు సమర్థించింది. ఒక వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారి, ఆచరిస్తున్నప్పుడు, వారిని షెడ్యూల్డ్ కులానికి చెందినట్లు పరిగణించలేమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు మంగళవారం నాడు సమర్థించింది. హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతం కాకుండా ఇతర మతాలను ఆచరించే ఏ వ్యక్తినైనా షెడ్యూల్డ్ కులానికి చెందినవారిగా పరిగణించలేమని కోర్టు పేర్కొంది. ఇతర మతంలోకి మారడం వల్ల షెడ్యూల్డ్ కుల హోదా తక్షణమే, పూర్తిగా రద్దవుతుందని కోర్టు స్పష్టం చేసింది.

**రాజ్యాంగంలో పేర్కొన్న రూల్స్ ఇవే..**

'రాజ్యాంగంలో పేర్కొన్న (షెడ్యూల్డ్ కులాలు) 1950 నిబంధన ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఈ ఉత్తర్వు కింద నిషేధం పూర్తిగా వర్తిస్తుందని కోర్టు గుర్తించింది. 1950 ఉత్తర్వులోని క్లాజ్ 3లో పేర్కొనని ఏ మతంలోకి మారినా, పుట్టుకతో సంబంధం లేకుండా ఎస్సీ హోదా తక్షణమే కోల్పోతారు. క్లాజ్ 3 ప్రకారం ఎస్సీగా పరిగణించని ఏ వ్యక్తికీ రాజ్యాంగం లేదా పార్లమెంటు లేదా రాష్ట్ర శాసనసభ చట్టాల కింద ఎటువంటి చట్టబద్ధమైన ప్రయోజనం, రక్షణ, రిజర్వేషన్ లేదా అర్హతను క్లెయిమ్ చేయలేరు. కనుక ఇతర మతంలోకి మారడంతో ఎస్సీగా కొనసాగలేరు. ఇందులో ఎటువంటి మినహాయింపులు ఉండవు. ఒక వ్యక్తి క్లాజ్ 3లో పేర్కొన్న మతం కాకుండా వేరే మతాన్ని ఆచరిస్తుంటే షెడ్యూల్డ్ కులానికి చెందినట్లు క్లెయిమ్ చేయలేరని' సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా చేస్తున్న ఒక వ్యక్తి, తనపై దాడి జరిగిందని ఆరోపిస్తూ కొందరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు దాఖలు చేసిన కేసులో ఈ తీర్పు వచ్చింది. ఆ వ్యక్తి ఎస్సీ/ఎస్టీ చట్టం కింద రక్షణ కోరగా, ఆ పాస్టర్ క్రైస్తవ మతంలోకి మారి, ఆచరిస్తున్నందున ఆ చట్టం వర్తించదని నిందితులు కోర్టును ఆశ్రయించారు.

**హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు..**

హైకోర్టు ఏప్రిల్ 30, 2025 నాటి ఉత్తర్వులో కుల వ్యవస్థ క్రైస్తవ మతానికి చెందినది కాదని, కనుక ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని నిబంధనలు అతడికి వర్తించవని పేర్కొంది. క్రైస్తవ మతంలోకి మారిన ఫిర్యాదుదారు దాఖలు చేసిన ఎస్సీ/ఎస్టీ చట్టం కింద చేసిన ఆరోపణలను హైకోర్టు జస్టిస్ హరినాథ్ ఎన్ కొట్టివేశారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆ పాస్టర్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ ఫైల్ చేశారు. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియాతో కూడిన బెంచ్ దీనిపై తీర్పు ఇచ్చింది. 'ఈ కేసులో పిటిషనర్ క్రైస్తవ మతం నుండి తిరిగి తన మతంలోకి మారినట్లు లేదా ఎస్సీ వర్గం అతడిని తిరిగి స్వీకరించినట్లు ఎక్కడా లేదు. అందుకు విరుద్ధంగా పిటిషనర్ క్రైస్తవ మతాన్ని కొనసాగిస్తున్నారు. దశాబ్ద కాలంగా పాస్టర్‌గా పనిచేస్తూ, క్రమం తప్పకుండా ప్రార్థనలు నిర్వహిస్తున్నారని ఆధారాలు ఉన్నాయి. సంఘటన జరిగిన టైంలోనూ ఆయన ఒక ఇంట్లో ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు అంగీకరించారు. ఇవన్నీ పరిశీలిస్తే, ఆయనను ఎస్సీగా పరిగణించలేం. మత మార్పిడి తరువాత ఎస్సీ హోదా కోల్పోతారని' ధర్మాసనం స్పష్టం చేసింది.

## విజయవాడ

# ఉగ్ర కుట్ర భగ్నం

మొదటి పేజీ తరువాయి...

అల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ అనే పేరుతో ఒక రహస్య సంస్థను ఏర్పాటు చేసినట్లు విచారణలో వెల్లడైంది. స్థానిక యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించడం, వారిని రాడికలైజ్ చేయడం ఈ సంస్థ ప్రధాన ఉద్దేశ్యం. సోషల్ మీడియా వేదికగా ఉగ్రవాద భావజాలాన్ని ప్రచారం చేస్తూ, యువతలో మతపరమైన ఉన్మాదాన్ని నింపేందుకు వీరు ప్రయత్నించారు. ముఖ్యంగా భారత జాతీయ పతాకం స్థానంలో ఐసిస్ పతాకాన్ని ఉంచాలంటూ వీరు చేసిన ప్రచారం తీవ్ర దుమారం రేపుతోంది. నిందితులపై నిఘా ఉంచిన కౌంటర్ ఇంటలిజెన్స్ సెల్ అధికారులు, పక్కా సమాచారంతో వారి నివాసాలపై దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో అనేక ఎలక్ట్రానిక్ పరికరాలు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు , ఉగ్రవాద భావజాలానికి సంబంధించిన విద్రోహ పూరిత పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరు విదేశీ హ్యాండ్లర్లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. దీంతో ఈ ముగ్గురిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. విజయవాడ కేంద్రంగా సాగుతున్న ఈ వ్యవహారం వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో అధికారులు లోతుగా విచారిస్తున్నారు. వీరికి దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఉగ్రవాద ముఠాలతో సంబంధాలు ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ కు అప్పగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ఘటనతో విజయవాడ పోలీసులు అప్రమత్తమయ్యారు. అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘాను మరింత తీవ్రం చేశారు.


## చైతన్య విల్లాస్ కాలనీ శ్రీ రామాలయంలో
# అలరింప చేసిన నృత్య ప్రదర్శనలు






**రాజేంద్రనగర్, మార్చి24(ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లి చైతన్య విల్లాస్ కాలనీ లో గల శ్రీ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం కూకట్పల్లికి చెందిన కలర్స్ ఆఫ్ డాన్స్ ఇనిస్ట్యూట్ నిర్వాహకురాలు ఎన్ఎస్ఎల్ ప్రవీణ నేతృత్వంలో శిక్షణ పొందిన బాలికలు నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆలరింపచేసింది. ఆలయ శ్రీరామనవమి ఉత్సవాల అడ్ హక్ కమిటీ సభ్యులు జ్యోశి, ఆదర్శ శుక్ల ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. వర్షం కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పటికీ సెల్ ఫోన్ టార్చ్ లైట్ తో నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సంగీత నృత్య ప్రదర్శన తిలకించటానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ ప్రదర్శనకు నేతృత్వం వహించిన కామేశ్వరి చిన్నారులకు ఎన్ సి నరసింహ చార్యులు, అలమేలు మంగ చేతుల మీదుగా మెమొంటలను అందజేశారు



## 7వ వేతన బకాయిలను మంజూరు చేయించినందుకు
## వీసీని సన్మానం చేసిన ఉద్యోగులు

**రాజేంద్రనగర్, మార్చి24 (ప్రభాత ఉదయం)**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రొఫెసర్ జానయ్యను కలిసి సన్మానించారు. విశ్వవిద్యాలయం బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ అల్దాస్ జానయ్య ఏడవ వేలున సవరణ బకాయిలను ఇప్పించి నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ శాలువ తో సత్కరించారు. చాలా సంవత్సరాలుగా ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను ఇప్పించినందుకు ఉద్యోగులు లత, నవీన్, డాక్టర్ అంజయ్య, డి ఉపేంధర్, డాక్టర్ బాను రేఖ,శేఖర్, ఎల్లా గౌడ్, అక్షర మురళి, బి.సి. ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతి నిదులు కవిత, అరుణ్, విక్రాంత్, సంతోష్ గౌడ్, సలీం సందీప్ గౌడ్, జనార్ధన్ , ఇతర ఉద్యోగులు ఉపకులపతి ప్రొఫెసర్ జానయ్య కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.

## అన్నదమ్ముల మధ్య గొడవ, ఒకరికి కత్తిపోట్లు

**బుద్వేల్, మార్చి 24 (ప్రభాత ఉదయం)**


సోదరుని చేతిలో గాయపడ్డ తమ్ముడు

అన్న దమ్ముల మధ్య ఉన్న ఆర్థిక లావదేవీలు కత్తిపోట్లకు దారితీశాయి. ఫలక్ నుమా పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టెపల్లి సమీపంలో మంగళవారం తెల్లవారు జామున జరిగిన ఈ సంఘటన వివరాలు ఈ విదంగా ఉన్నాయి... వట్టెపల్లి కి చెందిన అశ్రఫ్ (27), షర్ఫుద్దీన్ అన్న దమ్ములు. ఆశ్రఫ్ ఫంక్షన్హల్అలో సప్లై పనులు చేస్తుండగా, షర్ఫుద్దీన్ పూల వ్యాపారం చేస్తున్నాడు. వీరిరువురి మధ్య గతంలో కూడా గొడవలు ఉన్నాయి. మంగళవారం తెల్లవారు జామున ఆర్థిక లావాదేవీల విషయమై అన్నదమ్ముల మధ్య గొడవ జరిగింది. షర్ఫుద్దీన్ తమ్ముడు అశ్రఫ్ ను కతి బితో గాయపరిచారు. ఈ సంఘటనలో ఆశ్రప్ గొంతుకు గాయమై కుప్పకూలిపోయాడు. సమచారం అం దుకున్న ఫలక్నుమా పోలీసులు గాయపడ్డ ఆశ్రఫ్ ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


హైదర్ గూడ లోని ఓ పెట్రోల్ బంక్ వద్ద బారులు తీరిన వాహనదారులు

## పెట్రోల్, డీజిల్ కొరతతో
# వాహనదారుల ఇబ్బందులు

**బుద్వేల్, మార్చి 24 (ప్రభాత ఉదయం)**




పెట్రోల్ బంకులకు పెట్రోల్, డీజీల్ కావాలంటే మూడు రోజుల ముందే అడ్వాన్స్ పేమెంట్ చేయాలనే కొత్త నిబంధనలను పెట్రోల్, డీజీల్ సరఫరా చేసే డీలర్లు పెట్టడం తో చాలా పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజీల్ కొరత ఏర్పడింది. కొన్ని పెట్రోలో బంకులు మూత పడ్డాయి. దీంతో పెట్రోల్ బంకుల వద్ద వాహనదారుల రద్దీ పెరిగింది. ఈ సమస్య మంగళవారం మద్యాహ్నం నుం చి రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల లో గల పెట్రోల్ బంకుల తో పాటు నగరంలోని పెట్రోల్ బంకుల్లో ఎక్కువగా కనిపించింది.

**గతంలో పెట్రోల్ బంకులకు క్రెడిట్ ఇచ్చేవారు: పెట్రోల్ బంకుల నిర్వాహకులు**

గతంలో పెట్రోల్ బంకులకు ఏజెన్సీ డీలర్లు వారి వారి సామార్థ్యాన్ని బట్టి క్రెడిట్ ఇచ్చేవారని పెట్రోల్ బం కుల నిర్వాహకులు తెలిపారు. ఒకరికి 30 లక్షలు క్రెడిట్ ఇస్తే మరొకరికి రూ.2 కోట్ల వరకు క్రెడిట్ పైన పెట్రోల్, డీజీల్ లు వంపించేవారని గుర్తు చేశారు. ఇరాన్, ఇజ్రాయేల్ వార్ నేపథ్యంలో క్రెడిట్ ఇచ్చే విధానాన్ని ఆపివేశారని, డబ్బులు చెల్లించి పెట్రోల్, డీజీల్ తీసుకువెళ్లండి అని చెప్పారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ పడతి కూడా కాకుండ మూడు రోజుల ముందే పెట్రోల్ బంకులకు కావాల్సిన పెట్రోల్, డీజిల్లకు డబ్బులు చెల్లిస్తే ఆ తర్వాత పంపిస్తామని చెబుతున్నారని వాపోయారు. దీంతో చాలా పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ అయిపోయినా, క్రెడిట్ పద్ధతిన పెట్రోల్ ఇవ్వకపోవడంతో డబ్బులు కట్టి మూడు రోజులు ఆగిన తర్వాత పెట్రోల్, డీజీల్ పంపిస్తున్నారని, దీంతో చాలా పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ కొరత ఏర్పడిందంటున్నారు.

# రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలలో వర్షం ఇబ్బందులు



హైదర్ గూడ బాంటియా వెనుక వీధిలో చెరువులా మారిన రోడ్డు



పీడీపీ చౌరస్తాలో ట్రాఫిక్ జామ్

**బుద్వేల్, మార్చి 24 (ప్రభాత ఉదయం)**

మంగళవారం సాయంత్రం రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలో ఈదురు గాలులతో కూడిన పనగండ్ల వర్షం కురిసింది. సాయంత్రం 7 గంటల నుంచి 8:30 గం టల వరకు పడిన వర్షం కారణంగా రోడ్లన్ని జలమయం అయ్యాయి. ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగి పడిపోయాయి. హైదర్ గూడ బాంటియా షోరూమ్ వెనుకాల వీధిలో రోడ్లు చెరువులను తలపిం చాయి. వర్షం నీటితో పాటు డ్రైనేజీ మ్యాన్హాల్లు పొంగి పారడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిం చింది. ఉప్పరపల్లి 191 పిల్లర్ వద్ద రోడ్డుపై కొద్ది సేపు వర్షం నీరు ఆగడంతో వాహనాల రాకపోకలు స్థంబించిపోయాయి. ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. శివరాంపల్లి బెస్ట్ ప్రైజ్ వద్ద కూడా రోడ్డుపై వరద నీరు ఆగడంతో వాహవదారులు ఇబ్బందులు పడ్డారు.


మహనీయుల జయంతి ఉత్సవాల బ్రోచర్ ను ఆవిష్కరిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

## మహనీయుల జయంతి ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

**బుద్వేల్, మార్చి 24 (ప్రభాత ఉదయం)**


ఏప్రిల్ 5న ఆరాంఘర్ బాబు జగ్జీవన్ రాం చౌరస్తాలో నిర్వహించనున్న భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్రాం, ఏప్రిల్ 14న రాజేంద్రనగర్ లో నిర్వహించనున్న రాజ్యాంగ నిర్మాత బాబా సాహేబ్ డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల బ్రోచర్ ను మంగళవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ మైలార్దేవుపల్లి లోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇరువురు మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా ఐక్యమత్యంతో చేయాలన్నారు. కార్యక్రమంలో ఉత్సవాల కమిటీ చైర్మన్ దాసరి రమేశ్, కో చైర్మన్ నందిగామ నర్సింహ్మ, ప్రధాన కార్యదర్శి మంగలారం శ్రీనివాస్, కోశాధికారి పలుగుచెరువు మహేందర్, దళిత నాయకులు పి. జీవన్ దాస్, పలుగుచెరువు మహేశ్, కెఎస్ దయానంద్, అనుమూల జాన్పాల్, గుం టి సురేశ్, పోతురాజు యాదయ్య, పంబాల జనార్ధన్, పంబాల రాజు, ఆర్ శ్రావణ్, పద్మ, పత్యార నర్సిం హ్మ, పి మోహన్రావు, గుడిసె యాదయ్య, ఎడ్లకాడి సూర్యం, తదితరులున్నారు.


ఆస్తి పన్ను చెల్లించని దుకాణం ను సీజ్ చేస్తున్న అధికారులు

## ఆస్తిపన్ను చెల్లించని దుకాణాన్ని సీజ్ చేసిన అత్తాపూర్ సర్కిల్ అధికారులు

**బుద్వేల్, మార్చి 24 (ప్రభాత ఉదయం)**

ఎం ఎం పహడీలో సయ్యద్ అయూబ్ అలీ హుస్సేన్ కు చెం దిన మేరాజ్ బుక్ స్టోర్స్ ఉన్న ప్రాంతానికి ఆస్తి పన్ను బకాయిలు రూ.11,39,149 ఉండటం, ఆ పన్నును చెల్లించకపోవడంతో మంగళవారం అత్తాపూర్ సర్కిల్ అధికారులు ఆ దుకాణాన్ని సీజ్ చేశారు. అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వి సమ్మయ్య, ఎఎంసీ నిర్మల ల ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆస్తిపన్ను బకాయిలపై ప్రభుత్వం 90శాతం రాయితీ కల్పిం చిందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఐ హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.


కూరగాయల పెంపకం శిక్షణ కార్యక్రమం ను ప్రారంభిస్తున్న అటారీ డైరెక్టర్ డాక్టర్ షేక్ మీరా


## కూరగాయల సాగును పెంచాల్సిన అవసరం ఉంది

బుద్వేల్, మార్చి 24 (ప్రభాత ఉదయం) : కూరగాయల స్వయం సమృద్ధిలో దేశంలోనే మోడల్ కూరగాయల హబ్ గా ఎదిగేందుకు అనువైన వాతావరణ తెలంగాణ రాష్ట్రంలో ఉందని, అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (అటారి) డైరెక్టర్ డాక్టర్ షేక్ మీరా అన్నారు. రాజేంద్రనగర్ లో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ప్రాధమిక సహకార పరపతి సంఘాల నుంచి ఎంపిక చేసిన వెజిటబుల్ వాలీంటర్లకు కూరగాయల సాగు పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొని ప్రసంగించారు. రైతులే స్వచ్ఛందంగా కూరగాయల సాగు విస్తీర్ణంపై దృష్టి సారించాలన్నారు. ప్రతి రైతు మరొక రైతును కూరగాయల సాగు వైపుకు మళ్లించేలా రైతులు కృషి చేయాలన్నారు. దేశంలో ఇప్పటికే అహార భద్రత సాధ్యమైందని, పోషక భద్రత కేవలం కూరగాయల అందుబాటు పెరగడం తోనే సాధ్యమన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి మాట్లాడుతూ, రైతులకు ప్రభుత్వాలు అందజేస్తున్న సబ్సిడీలను ఉపయోగించుకుని కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేలా చూడాలన్నారు. శిక్షణ కు హాజరైన రైతులకు క్షేత్ర స్థాయిలో కూరగాయల పంటల ను చూపించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉధ్యాన వర్సిటీ ఉన్నతాధికారులు డాక్టర్ చీనా, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సురేశ్ కుమార్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ అనితా కుమారి, ఉద్యాన శాఖ జేడీఏ పద్మనాభ తదితరులు పాల్గొన్నారు.


# ఆసక్తితో భారం కలిగి యేసు ప్రభువును సేవిస్తే ఆశీర్వాదాలు లభ్యం



రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ సభ్యులు



బైబిల్ సందేశాలను అందచేస్తున్న రెవరెండ్ డాక్టర్ జాషువా గుమ్మళ్ళ



ఆరాధన లో నడిపిస్తున్న రెవరెండ్ దీవెన్

## దైవసేవకులు
## రెవరెండ్ డాక్టర్ జాషువా గుమ్మళ్ళ

**బుద్వేల్, మార్చి 24 (ప్రభాత ఉదయం)**

ఆసక్తి విషయంలో మాంద్యులు కాక, ఆత్మయందు తీవ్రత గలవారై ప్రభువును సేవించుడి... నిరీక్షణ గలవారై సంతోషించు, శ్రమయందు ఓర్పు గలవారై, ప్రార్థన యందు పట్టుదల కలిగి యుండుడి... అని రోమ 12 : 11 , 12 వచనాల్లో చెప్పిన విధంగా దైవ సేవకులైన వారు ఆసక్తితో ప్రభువును సేవించాలని జాషువా గుమ్మల్లా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవరెండ్ డాక్టర్ జాషువా గుమ్మళ్ళ అన్నారు . మంగళవారం ఉప్పర్ పల్లి లోని రాక్ చర్చ్ లో రెవరెండ్ ఎన్ రాజారాం అధ్యక్షతన పాస్టర్ బట్టు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో రెవరెండ్ డాక్టర్ జాషువా గుమ్మళ్ళ పాల్గొని బైబిల్ సందేశాలను అందచేశారు. సేవకులుగా పనిచేస్తున్న వారు దేవుని కొరకు మండే విధంగా ఉండాలన్నారు. దేవుని సేవ చేయడం గొప్ప విషయమని, క్రమంగా దేవుని సేవ చేయాలన్నారు. దేవునిలో శ్రేష్టమైన సేవ జరిగించాలన్నారు తాను నలభై రెండు సంవత్సరాలుగా యేసయ్య సేవలో ఉన్నానని, నేటికీ కూడా నూతన విషయాలను నేర్చుకుని సంఘ సభ్యులకు బోధిస్తానన్నారు. దేవుని సేవలో కొత్తదనం ఉండాలని, దేవుని సంతోషపెట్టే వారిగా సేవకుల పని విధానం ఉంటే మంచిదన్నారు. దేవుని సేవలో ఉన్న అనేకమంది ఆత్మల రక్షణ కోసం తపించేవారిగా పనిచేసి విజయం సాధించారని గుర్తు చేశారు. భారం కలిగి యేసు ప్రభువును వెంబడించాలని తెలిపారు. బానిసలు, కార్మికులు ఏ విధంగా పని చేస్తారో.. ఆ విధంగా దేవుని సేవకులు ఆయనకు అంకితమయ్యి సేవ జరిగించాలన్నారు. దేవుని సేవకులు సుఖ పడటానికి సేవలోకి రాలేదని గుర్తుంచుకోవాలన్నారు. ఆత్మల కోసం... సంఘం కోసం... నీతి కోసం భారం కలిగి ప్రార్థించాలన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు జరుగుతున్నా... కరువులు సంభవిస్తున్నా..అనేక ప్రమాదాలు జరుగుతున్న ప్రజలలో చలనం లేకుండా పోతుందని, దేవుడంటే భయం లేకుండా ఉందని, అలాంటి వారి కోసం దైవ సేవకులైన వారు భారంతో ప్రార్థన లు చేయాలని కోరారు. దైవ సేవకులకు ఓపిక , సహనం ఉండాలని నమ్మకంతో పట్టుదలగా ప్రార్థించాలని , ఆత్మలో ఆనందించే వారిగా ఉంటూ బలమైన ప్రార్థనా జీవితాన్ని కలిగి ఉ ండాలన్నారు. అప్పుడు సేవకులు అడుగుపెట్టే ప్రతి స్థలాన్ని ఏసుప్రభువు దీవిస్తాడని, ఆశీర్వదిస్తాడని గుర్తు చేశారు. సమావేశంలో రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ కె సుందర్ పాల్ మూడు సంవత్సరాలుగా సహకరించిన ప్రతి ఒక్క సేవకునికి ధన్యవాదాలు తెలియచేశారు. రెవరెండ్ దీవెన్ ఆరాధనలో నడిపించారు. మోజెస్ బండారి, ఎ డానియల్ లు సాక్ష్యం చెప్పి దేవుని మహిమ పరిచారు. రెవరెండ్ జె పీ పాల్ ప్రార్థనలో నడిపించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం కు చెందిన పాస్టర్లు, పాస్టరమ్మ లు పాల్గొన్నారు.

**నూతన కమిటీ :**

రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ని ఫెలోషిప్ గవర్నింగ్ బాడీ సభ్యులు రెవరెండ్ డాక్టర్ జాషువా గుమ్మళ్ళ ప్రకటించారు. ఫెలోషిప్ నూతన అధ్యక్షులుగా రెవరెండ్ సీ హెచ్ సునీల్ సామ్యూల్, ఉపాధ్యక్షులుగా రెవరెండ్ ప్రమోద్, ప్రధాన కార్యదర్శి గా రెవరెండ్ ప్రణీత్ బాబు, సంయుక్త కార్యదర్శి గా పాస్టర్ సోమారం రాజ్ కుమార్, కోశాధికారిగా పాస్టర్ బట్టు శ్రీకాంత్, కమిటీ సభ్యులు గా రెవరెండ్ మొండితోక విజయ్ కుమార్, రెవరెండ్ యేసు రత్నం, బ్రదర్ రాజ్ కుమార్ ఇశ్రాయేల్, రెవరెండ్ గుంటి డానియల్, రెవరెండ్ గోపాల్ నాయక్ లు నియమితులైనారు.



## అంగన్వాడి కేంద్రాలకు ఒంటి పూట బడి మంజూరు చేయాలని మంత్రి సీతక్కకి వినతి పత్రం

### అందజేసిన జిల్లా అధ్యక్షురాలు ఇందరమ్మ

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 24(ప్రభాత ఉదయం)**

అంగన్వాడి కేంద్రాలకు ఒంటి పూట బడి మంజూరు చేయాలని మంత్రి సీతక్కకి జిల్లా అధ్యక్షురాలుఇందరమ్మ వినతి పత్రం అందజేశారు హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్ లో తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడం పరిస్థితిలో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు ఏ విధంగా ఒంటిపూట ఇస్తున్నట్లుగానే అదేవిధంగా అంగన్వాడి కేంద్రాలలో చదువుకుంటున్న చిన్నారులకు, టీచర్లకు కూడా ఒంటిపూట బడులను వర్తించే విధంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కి మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర కన్వీనర్, నిర్మల, రాష్ట్ర కార్యదర్శి సౌదామిని,జిల్లా అంగన్వాడీ కేంద్రం అధ్యక్షురాలు ఇందరమ్మ , కార్యవర్గ సభ్యురాలు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో అంగన్వాడి కేంద్రాల్లో కూడ ఒంటి పూట బడి ఏర్పాటు చేయాలని అంగన్వాడీ టీచర్లు ప్రయత్నించిన సాధ్యం కానిది జోగులాంబ గద్వాల జిల్లా అంగన్వాడి టీచర్లతో ఒంటిపూట బడి ఏర్పాటు చేయాలని కోరిన వెంటనే మంత్రి సీతక్క స్థానికులంగా స్పందించి త్వరలోనే మంజూరు చేస్తున్నట్టు ఉత్తర్వులను జారీ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్, నిర్మల, రాష్ట్ర కార్యదర్శి సౌదామిని, జోగులాంబ గద్వాల జిల్లా అంగన్వాడి అధ్యక్షురాలు ఇందిరమ్మ, జిల్లా నాయకురాలు జయమ్మ రజియా పుష్ప,సుజాత, మహేశ్వరి, వెంకటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.




## యూజీసి నెట్, టీజీ సెట్ ప్రతిభచాటిన విద్యార్థులకు సన్మానం

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 24(ప్రభాత ఉదయం)**

గద్వాలలోని పి.జి సెంటర్ లో చదువుతున్న విద్యార్థులు యుజీసీ నెట్, టీజీ సెట్ అర్హత సాధించి రాష్ట్ర , జాతీయస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులను మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చవ్వా వెంకట్ రెడ్డి శాలువాతో సత్కరించారు. ఎంఏ ఇంగ్లీష్ విభాగంలో వెంకట్రాములు యూజీసీ నెట్ మరియు టీజీసెట్ లో ప్రతిభ చాటగా, ప్రకాష్ టీజీ సెట్ లో ప్రతిభ చాటారు. ఎంబీఏ డిపార్ట్‌మెంట్ నుండి ఎన్.నిఖితా రెడ్డి, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ నుండి గాయత్రి యుజీసి నెట్ నందు పీహెచ్ డీ సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ చవ్వా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల శ్రమకు, పట్టుదలకు ఈ ఫలితాలు నిదర్శమని కొనియాడారు. అంకిత భావంతో శ్రమిస్తే ఫలితం తప్పక వస్తుందని, మిగతా విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకొని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో విజయం సాధించి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి గుర్తింపు తీసుకరావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోపినాథ్ రాథోడ్, డాక్టర్ కె మహేందర్, బండారపల్లి అరవింద, గణేష్, డాక్టర్ రవి షరీన్, ఎండి రఫి, రంగా రెడ్డి, నవీన్ గౌడ్, నమ్రత. శ్వేత, శ్రీనివాసులు అలాగే బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.






## నడిగడ్డకు తాకిన యుద్ధ సెగ

### గ్యాస్ కొరతతో గోధాం వద్ద బారులు తీరిన వినియోగదారులు

### బంకులు మూసివేస్తారన్నా ప్రచారంతో పెట్రోల్ బంకుల వద్దకు పరుగులు తీస్తున్న వాహనదారులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 24(ప్రభాత ఉదయం)**

ప్రస్తుతం జరుగుతున్న ఇరాన్-అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావం ప్రపంచమంతటా ఉంది. ఈ ప్రభావం భారతదేశంపై కూడా పడుతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే పశ్చిమ ఆసియాలో యుద్ధం ప్రభావం తెలంగాణలోని అన్ని జిల్లాలతో పాటు జోగుళాంబ గద్వాల జిల్లాకు యుద్ధ సెగలు తాకాయి. ఇప్పటికే కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో జిల్లాలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు, టీ స్టాల్స్ మూతపడ్డాయి. డొమెస్టిక్ గ్యాస్ కొరత ఉండటంతో గ్యాస్ కోసం గోధాం ల వద్ద వినియోగదారులు బారులు తీరారు. తాజాగా పెట్రోల్, డీజిల్ కొరత వస్తుందని పుకార్లు ఊపందుకున్నాయి. దీంతో పెట్రోల్ బంకులు మూతపడుతాయన్నా ప్రచారం జోరుగా జరుగుతోంది. దీంతో వినియోగదారులు బంకుల వద్దకు పరుగులు తీస్తున్నారు. పెట్రోల్, డీజిల్ కొరత దృష్ట్యా గద్వాల్ లోని పలు పెట్రోల్ బంకులు వాహనదారులతో కిక్కిరిసిపోయాయి. బంకుల వద్ద ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, డబ్బాలు,సీసాలతో వినియోగదారుల తాకిడి ఒక్కసారిగా పెరగడంతో గందరగోళ పరిస్థితులు చోటుచేసున్నాయి. డీజిల్, పెట్రోల్ విషయంలో అసత్య ప్రచారం ముమ్మారంగా జరుగుతున్నా ఆయా శాఖల అధికారులు స్పందించడం లేదని వాహనదారులు ,వినియోగదారులు మండిపడుతున్నారు. వీలైనంత త్వరగా ఈ విషయంపై అధికారులు స్పందిస్తే పరిస్థితులు అదుపులోకి వచ్చే అవకాశం ఉంది.



## సీసీరోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 24 (ప్రభాత ఉదయం)**

సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని కేటిదొడ్డి ఎంపిడిఓ రమణరావు సూచించారు. మంగళవారం కేటిదొడ్డి మండలం మల్లాపురం తండా గ్రామానికి మంజూరైన సీసీ రోడ్డు పనులకు ఎంపీడీఓ రమణరావు, గ్రామ సర్పంచ్ పాండు నాయక్ తో కలిసి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ రహదారి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## డిగ్రీ కళాశాలలో ఆకట్టుకున్న మాక్ అసెంబ్లీ.!

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 24 (ప్రభాత ఉదయం)**

అసెంబ్లీలో మంత్రులు, ప్రతిపక్ష నేతల మధ్య ప్రజా సమస్యలపై వాదోపవాదాలు జోరుగా సాగుతుంటాయి. శాసనసభ కార్యకలాపాలను విద్యార్థులకు మరింత అవగతం చేసేందుకు గద్వాలలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం డిపార్ట్మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో విద్యార్థినీలకు మాక్ అసెంబ్లీ సెషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీలు అసెంబ్లీ సెషన్ లో రూలింగ్ పార్టీ, అపోజిషన్ పార్టీ సభ్యులుగా పాల్గొని సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం, ప్రభుత్వ సమాధానాలు చెప్పడం వంటి వంటి వాటిని అనుసరించడం జరిగింది. ప్రజా సమస్యలపై చర్చలు, సంక్షేమ బిల్లుల ప్రవేశపెట్టడం వంటి అంశాలను సమర్థంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.మీనాక్షి మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించే స్థాయికి ఎదగాలని విద్యార్థులను ఆశీర్వదించారు. చదువుతో పాటు రాజకీయాలపై.. అసెంబ్లీ సమావేశాలపై కూడా అవగాహన కల్పించిన మాక్ అసెంబ్లీ నిర్వహణను ఆమె ప్రశంసించారు.




## ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఓ వరం

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

**కూకట్ పల్లి, మార్చి 24 (ప్రభాత ఉదయం)**

ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఓ వరం అని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని ప్రగతి నగర్ లో నివాసం ఉంటున్న పోశాల రాజు తండ్రి, అజ్మీర్ తల్లి తీవ్ర అనారోగ్యంతో గురై సమస్యతో బాధపడుతూ హాస్పిటల్లో చికిత్స పొందారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఆయనకు సహాయం అందించేందుకు వెంకటేశ్వర నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందుల శివకుమార్ ను సంప్రదించగా, గొట్టిముక్కల వెంకటేశ్వర రావు సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సంబంధించిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వారి కుటుంబ సభ్యులకూ వైద్య...



## సాగునీటి ప్రాజెక్టులను సందర్శించిన జిల్లా కలెక్టర్

**జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 24 (ప్రభాత ఉదయం)**

జిల్లాలోని పలు సాగునీటి ప్రాజెక్టులను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి సందర్శించారు.మొదట ధరూర్ మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద కుడి, ఎడమ కాలువలను అలాగే సమాంతర కాలువను కలెక్టర్ పరిశీలించారు. కృష్ణ బేసిన్ లో ఉన్న పలు ప్రాజెక్టులను గురించి మొదలుకొని జిల్లాలోని పలు రిజర్వాయర్ల నీటి సామర్థ్యం, ఎత్తిపోతల పథకాల కింద సాగు చేసే ఆయకట్టు వివరాలను జిల్లా కలెక్టర్ కు అధికారులు సమగ్రంగా వివరించారు. జూరాల ప్రాజెక్టుకు వర్షాకాలంలో 3 లక్షలకు పైగా వరద వచ్చినప్పుడు తీసుకునే జాగ్రత్తలు, జల విద్యుత్తు ఉత్పత్తి, తదితర విషయాల గురించి తెలిపారు. జూరాల ప్రాజెక్టు పరిధిలో చేపట్టిన ఎత్తిపోతల పథకాల గురించి విపులంగా వివరించారు. స్కాడో రూంలో ప్రాజెక్టు గురించి మ్యాప్ ద్వారా అధికారులు కలెక్టర్ కు వివరించారు. డ్యామ్ గేట్లు, ఇతర నిర్మాణాలను కలెక్టర్ సీసీ కెమెరాల ఫుటేజీలో పరిశీలించారు. అనంతరం గుడ్డెందొడ్డి పంపు హౌస్ కు వెళ్లే గ్రావిటీ కాలువను కలెక్టర్ పరిశీలించారు. అక్కడి నుంచి గుడ్డెందొడ్డి లిఫ్ట్ వన్ పంప్ హౌస్ దగ్గరికి వెళ్ళిన కలెక్టర్ ప్రాజెక్ట్ మోడల్ డయాగ్రమ్స్ ను, ఆపరేటింగ్ గదులను పరిశీలించారు. అక్కడ నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా తెలియజేశారు. అలాగే ర్యాలంపాడు రిజర్వాయర్ వద్దకు చేరుకున్న కలెక్టర్ కు 4 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించారని, సుమారు 1.33 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా నిర్మాణం చేపట్టడం జరిగిందని అధికారులు వివరించారు. రిజర్వాయర్ కింద భూములు కోల్పోయిన రైతులు, గ్రామస్తులకు కల్పించిన సౌకర్యాల గురించి కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. ఈ పర్యటనలో పీజేపీ ఎస్ఈ రహీముద్దీన్, ఈఈలు జుబేర్ అహ్మద్, శ్రీనివాసులు, పలువురు డీఈలు, ఇతర ఇరిగేషన్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ ఫోన్లు పోయిన వెంటనే సెయిర్ పోర్టల్లో ఫిర్యాదు చేసుకోవాలి

### వరంగల్ వెస్ట్ జోన్ జనగామ డీసీపీ రాజ మహేంద్ర నాయక్

### మొబైల్ ఫోన్లు కోల్పోయిన బాధితులకు తిరిగి అప్పగించిన జనగామ పోలీసులు

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 24 (ప్రభాత ఉదయం)**



మొబైల్ ఫోన్లు కోల్పోయిన బాధితులకు తిరిగి ఇస్తున్న పోలీస్ లు

జిల్లాలో మొబైల్ ఫోన్లు కోల్పోయిన బాధితులకు ఉపశమనం కలిగించే విధంగా వరంగల్ వెస్ట్ జోన్ జనగామ డీసీపీ రాజ మహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలో మొబైల్ ఫోన్లు కోల్పోయిన బాధితులకు ఉపశమనం కలిగించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సెయిర్ (సెంట్రల్ ఈక్వయిప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌ను వినియో గించి, పోయిన, దొంగిలించ బడిన మొబైల్ ఫోన్లను సమర్థవంతంగా ట్రేస్ చేసి, వాటిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రైమ్ మీటింగులో ఏసిపి కార్యాలయంలో బాధితు లకు వారి మొబైల్ ఫోన్లను అధికారుల చేతుల మీదుగా తిరిగి అప్పగించారు. ఈ కార్యక్రమంలో పలువురు బాధితులు తమ మొబైల్ ఫోన్లు తిరిగి పొందడంతో ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రజలు తమ మొబైల్ ఫోన్లు పోయిన వెంటనే సెయిర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఈ పోర్టల్ ద్వారా దేశ వ్యాప్తంగా మొబైల్ ఫోన్లను ట్రాక్ చేయడం సులభమవు తుందని తెలిపారు. అలాగే భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవలను మరింత వేగంగా, సమర్థవంతంగా అందించేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏసిపి పందరి చేతన్ కుమార్, సిఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గద్దల కిషోర్

## వనిత టీ స్టాల్‌ను తొలగించాలనే కుట్రలను విరమించుకోవాలి

### కలెక్టర్ పేద బలహీన వర్గాల మీద ప్రతాపం చూపడం తగదు

### ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు గద్దల కిశోర్

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 24(ప్రభాత ఉదయం):**

పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు స్థానిక జనగాం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు సెర్ప్ వారు అప్పు అందించి పేదరిక నిర్మూలన చేయాలనే సద్దుదేశం తో పాత కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆధ్వర్యంలో ప్రారంభించిన వనిత టీ స్టాల్ తొలగించాలని ప్రస్తుత కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చేస్తున్న చర్యలను ఖండిస్తూ వారికి అండగా ఎమ్మార్పీఎస్ ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో వనిత టి స్టాల్ మహిళా కు సాంఘీభావంగా మంగళవారం నిలిచారు. ఈ సందర్భంగా ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు గద్దల కిశోర్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ వనిత టీ స్టాల్ ను తొలగించాలనే కుట్రలను విరమించుకోవాలని, కలెక్టర్ పేద బలహీన వర్గాల మీద ప్రతాపం చూపడం తగదన్నారు. ప్రభుత్వం పేదరికాన్ని నిర్మూలించాలని అనేక మహిళ సంఘాలకు సెర్ప్ ఆధ్వర్యంలో జీవనోపాధి కల్పించడానికి అప్పు ఇచ్చి వారికి సాధికారత కు కృషి చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తుంటే జనగామ జిల్లా కలెక్టర్ అందుకు విరుద్ధంగా ఒక పేద దళిత మహిళ పెట్టుకున్న వనిత టీ స్టాల్ తీసేయమనడం శోచనీయమని ఈ సందర్భంగా ఈ ప్రభుత్వం ప్రజా పాలన అని ప్రజలను మోసం చేయడం తగదని వారు అన్నారు ఈ కలెక్టర్ తన ప్రతాపాన్ని పాలన మీద చూపించాలి కానీ పేద దళితుల మీద చూపెట్టడం తన అహంకారానికి నిదర్శనం మన్నారు. వేంటనే ప్రభుత్వం ఆ టీ స్టాల్ సజావుగా నడిపేలా చేయాలని దీని మీద మంత్రులు స్పందించి తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని లేని పక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భవిష్యత్తు కార్యాచరణ తో ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పైస రాజశేఖర్ మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి సందేన రవీందర్ మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల సుధాకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బొట్ల మహేష్ మాదిగ,, గువ్వల రవి మాదిగ,, ఎమ్మెస్పీ జిల్లా కార్యదర్శి మచ్చ అబ్బయ్య, శ్రీపతి ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

## జనగణనలో తప్పులు దొర్లకుండా చూడాలి

### జనాభా లెక్కంపు ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 24(ప్రభాత ఉదయం):**



జనగణన - 2027 ఫేస్ - 1 గృహాల జాబితా, గృహ గణన నిర్వహణలో భాగంగా నూతనంగా ఎంపికైన టెక్నికల్ అసిస్టెంట్లు, జనాభా లెక్కల ఛార్జ్ క్లర్క్ లకు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం, ఈ శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై, నూతనంగా ఎంపికైన వారికి జనగణనపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జనగణన ప్రక్రియలో ప్రతి వివరాన్ని ఖచ్చితత్వంతో నమోదు చేయాలని, అలాగే టెక్నికల్ అసిస్టెంట్లు సాంకేతిక పరికరాల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. డేటా సేకరణలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని, అలాగే జనగణన నిబంధనలపై పూర్తి అవగాహనతో తప్పులు దొర్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సీపీఓ చినకోట్యా నాయక్, జెడి హైదరాబాద్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



## జలమండలికి వాటర్ డైజెస్ట్ వరల్డ్ వాటర్ అవార్డ్

### బ్లూ గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ ను అభివృద్ధి చేసినందుకు ప్రతిష్టాత్మక అవార్డ్

**హైదరాబాద్, మార్చి 24 (ప్రభాత ఉదయం)**

న్యూఢిల్లీ లో ఈ నెల 23న నిర్వహించిన 20వ వాటర్ డైజెస్ట్ వరల్డ్ వాటర్ అవార్డ్స్ 2025--26లో జలమండలి ఈ ప్రతిష్టాత్మక అవార్డును గెలుచుకుంది. మంగళవారం ఈ అవార్డును జలమండలి ఎస్టీపీ సిజిఎం పద్మజ ప్రధాన కార్యాలయంలోని మేనేజింగ్ డైరెక్టర్ ఛాంబర్ లో ఎండీ అశోక్ రెడ్డి కి అందజేశారు. ఈ అవార్డు రావడంపై ఎండీ హర్షం వ్యక్తం చేశారు. పాలపిట్ట పార్క్ , బొటానికల్ గార్డెన్‌లో బ్లూ-గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసి, నీటి పునర్వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించినందుకు ఈ అవార్డు లభించింది. జలమండలి బ్లూ, గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్‌లో భాగంగా, రోజుకు 7 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన ఎస్టీపీ నుండి శుద్ధి చేసిన నీటిని పంపిణీ చేయడానికి ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో 250 మిల్లీమీటర్ల వ్యాసం గల డీఐ పైప్‌లైన్‌ను 1347 మీటర్ల పొడవులో నిర్మించారు. అదనంగా సంప్, పంప్ హౌస్, ఓపెన్ డ్రైన్లు వంటి సదుపాయాలను అభివృద్ధి చేశారు. ఈ శుద్ధి చేసిన నీటిని బొటానికల్ గార్డెన్‌లోని మొక్కలకు నీరుపోసేందుకు, అలాగే నీటి నిల్వలను పునరుద్ధరించేందుకు వినియోగిస్తున్నారు. దేశవ్యాప్తంగా నీటి సంరక్షణ, సుస్థిరత, సమర్థవంతమైన నీటి నిర్వహణలో విశిష్ట కృషి చేసిన ప్రభుత్వ సంస్థలు, కార్పొరేట్లు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు , ఇతర సంస్థలను ఈ అవార్డులు సత్కరిస్తాయి. అర్థవంతమైన నీటి పరిరక్షణ చర్యలకు గుర్తింపుగా ఈ అవార్డులు ప్రదానం చేశారు. జలమండలి ఇంటిగ్రేటెడ్ అర్బన్ వాటర్ , వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ ఎక్సలెన్స్ కేటగిరీలో ఈ అవార్డు ను సొంతం చేసుకుంది. ఈ కార్యక్రమంలో జలమండలి ఎస్టీపీ సీజీఎం సుజాత, జీఎంలు, డీజీఎంలు మేనేజర్లు పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం

### రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యం

### ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

**కూకట్ పల్లి, మార్చి 24 (ప్రభాత ఉదయం)**



రైతు భరోసా నిధులు విడుదల చేసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ గుడ్ విల్ హోటల్ చౌరస్తా వద్ద డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ రైతును రాజు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియచేసారు. మొదటి విడతలో భాగంగా ఎకరం వరకు వ్యవసాయ భూమి ఉన్న 70 లక్షల రైతుల ఖాతాల్లో రూ. 3,590 కోట్ల నగదు జమ కానుందని అన్నారు. మూడు విడతల్లో రైతు భరోసా నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలియచేసారు. కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం

### అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరు --

### ఏప్రిల్ మొదటివారంలో తిరిగి సమావేశం కానున్న కమిటీ

**హైదరాబాద్, మార్చి 24(ప్రభాత ఉదయం)**

హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ బోర్డు రూమ్‌లో ఈ రోజు రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్ఎంఏసీ -- స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ) సమావేశం జరిగింది. ప్రెస్ అకాడమీ, ఎస్ఎంఏసీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార--పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్, ఎస్ఎంఏసీ కో-చైర్‌పర్సన్ సీహెచ్ ప్రియాంకతో కలిసి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అక్రిడిటేషన్ కోసం జర్నలిస్టులు సమర్పించిన దరఖాస్తులను కమిటీ సభ్యులు సమగ్రంగా పరిశీలించారు. జర్నలిస్టుల నుంచి అందిన ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు కార్డు మంజూరులో ఎలాంటి లోపం ఉండదని స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కమిటీ సమావేశాన్ని వచ్చే నెల మొదటివారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లాల వారీగా కలెక్టర్లు పంపే 'జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)' ప్రతిపాదనలను కూడా పరిశీలించి ఆమోదం తెలుపుతుందని వెల్లడించారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లను కోరారు. సమాచార--పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్ పాటు ఇతర కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.




## శ్రీరామ నవమి మహోత్సవాలకు బండి రమేష్‌కు ప్రత్యేక ఆహ్వాన పత్రిక అందజేత

**కూకట్ పల్లి, మార్చి 24 (ప్రభాత ఉదయం)**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భరత్ నగర్ కాలనీ శ్రీ హరి హర క్షేత్ర దేవస్థానంలో ఈ నెల 27న జరగనున్న శ్రీ రామనవమి మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ కార్యాలయానికి ఆలయ కమిటీ సభ్యులు, భరత్ నగర్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు కలిసి వెళ్లి, వారికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే శ్రీ రామ నవమి పర్వదినాన జరిగే ప్రత్యేక పూజలు, కార్యక్రమాల్లో పాల్గొని దేవస్థానానికి ఆశీస్సులు అందించవలసిందిగా వినమ్రంగా కోరారు. ఈ ఆహ్వానాన్ని బండి రమేష్ సానుకూలంగా స్వీకరించి, కార్యక్రమానికి హాజరవుతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మూర్తి, వెంకటపతి రాజు, నాగేంద్రబాబు, బిక్షపతి గౌడ్, అలాగే భరత్ నగర్ వెల్ఫేర్ కమిటీ ప్రెసిడెంట్ నాగిరెడ్డి, నాగేశ్వరరావు, పి. వెంకటేశు మరియు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. భరత్ నగర్ కాలనీలో జరిగే శ్రీ రామ నవమి మహోత్సవాలు ప్రతి సంవత్సరం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించగా, ఈ ఏడాది మరింత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## మతాలకు అతీతంగా దళితులు ఐక్యం కావాలి

### ప్రవీణ్ పగడాల మరణం పై సమగ్ర విచారణ జరగాలి

### పీపుల్స్ యూనియన్ పర్ లిబర్టీ అండ్ జస్టిస్ అధ్యక్షుడు వలిగొండ విజయరాజు

**జనగామ జిల్లా ప్రతినిధి/ (ఆలేరు), మార్చి 24 (ప్రభాత ఉదయం):**



మాట్లాడుతున్న విజయరాజు

దళితులు మతాలకు అతీతంగా ఐక్య కావాల్సిన అవసరం ఉందని పీపుల్స్ యూనియన్ పర్ లిబర్టీ అండ్ జస్టిస్ అధ్యక్షుడు వలిగొండ విజయరాజు అన్నారు. మంగళవారం ప్రవీణ్ పగడాల ప్రథమ వర్ధంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో దళితులు, భారత రాజ్యాంగం మత స్వేచ్ఛ అనే అంశం పై అవగాహన సదస్సు పి.రవి కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విజయ కుమార్ మాట్లాడుతూ దేశంలో దళిత క్రైస్తవులకు సమస్య గా ఉన్న రాష్ట్రపతి ఉత్తర్వు రద్దు కోసం ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపు నిచ్చారు. ప్రవీణ్ పగడాల మరణం పై పౌర సమాజానికి అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రవీణ్ పగడాల మృతి పై మాట్లాడిన తీరు క్రైస్తవ సమాజ మనో భావాలను కించ పరిచే విధంగా ఉన్నాయన్నారు. భారత రాజ్యాంగం సెక్యులర్ స్ఫూర్తి కలిగి ఉందని దేశ పౌరులు సెక్యులరిజాన్ని గౌరవించా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ పి.డేవిడ్, డిఎస్ఎం ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్యాంసుందర్, రాష్ట కమిటి సభ్యులు జంగా శ్రీకాంత్, పి.జితేందర్, సీనియర్ జర్నలిస్టు అన్నమ్మ , స్థానిక పాస్టర్ల సంఘం అధ్యక్షుడు జీవరత్నం, దళిత సంఘం నాయకులు శ్రీను, జంగిటి నరేష్, పి.కిషన్, దయాకర్, నవజీవన్ తదితరులు పాల్గొన్నారు.

# పేద డ్వాక్రా గ్రూపు మహిళలకు కలెక్టర్ సహకరించాలి: వేధింపులు ఆపాలి

## సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 24(ప్రభాత ఉదయం):**

జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం గోడమూలకు గత జిల్లా కలెక్టర్ డ్వాక్రా గ్రూపు మహిళలు పాలమాకుల చిన్న మంజుల పోత్కనూరి విజయలక్ష్మి లకు ఇందిరా మహిళా శక్తి పథకంలో ఏర్పాటు చేసిన టీ స్టాల్ మిల్క్ పార్లర్లను స్థానంలో వారి దుకాణాలు నడుపుకునే విధంగా జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సహకరించాలని వేధింపులకు పాల్పడవద్దని, పేద అమాయక మహిళలను ఇబ్బందులపాలు చేయొద్దని సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. సిపిఎం జనగామ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సాధికారత లక్ష్యంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని వారికి చిరు వ్యాపారాలు తోపాటు వ్యాపార వాణిజ్య రంగాలలో మహిళా కేంద్రంగా అభివృద్ధి చేసి తీర్చిదిద్దుతామని కార్యక్రమం చేపడతావున్నారని, దానిని అంతర్భాగంగా జనగామ కలెక్టరేట్ కార్యాలయం గోడ మూలకు ఇద్దరు పేద మహిళలకు డిఆర్డిఏ లోను ఇచ్చి ఆరు నెలల క్రితం స్టాళ్లు ఏర్పాటు చేసి వారికి బతకమని గత కలెక్టర్ అవకాశం ఇస్తే ఇవాళ కొత్తగా వచ్చిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వాటి తొలగించడమే ఏకైక లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. జిల్లా వ్యాప్తంగా అనేక సమస్యలు ఉన్నాయి వేసవికాలం వస్తున్న తరుణంలో చెరువుకుంటలలో నీరు అడుగంటుతున్నాయని, వ్యవసాయ రంగంలో అనేక సమస్యలు ఉన్నాయని, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులలో కూలీలకు సరి అయిన వేతనం రావడం లేదని, జనగామ పట్టణంలో ప్రైవేటు వాటర్ ప్లాంట్ల నీటి వ్యాపారం జోరుగా సాగుతుందని, .ప్రజలకు సురక్షితమైన మంచినీరు


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

మున్సిపాలిటీ అందించలేకపోతోందని, పట్టణంలో చేపట్టిన సుందరీకరణ పనులు తీవ్రమైన నాణ్యత లోపంతో ఉన్నాయని, అవి మూడు సంవత్సరాలు నిండాకముందుకే ఎక్కడికి అక్కడ కూలిపోతున్నాయని,. దోమలు, కోతుల సమస్య తీవ్రంగా జిల్లాలో ఉందన్నారు. రైతులు పంటలు పండించలేని పరిస్థితి ఏర్పడ్డదని,, ప్రజల, చిన్న పిల్లల, మహిళల పైన కోతులు దాడులు పెరిగాయని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నత్తనడకగా నడుస్తుందని, అనేకమందికి ఇండ్లు, ఇళ్ల స్థలాలు లేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీలలో మౌలిక వసతులకు పంచాయతీలలో డబ్బులు లేక తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటారని ఇలా అనేక సమస్యలు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయని వాటి పరిష్కారం కోసం కలెక్టర్ కృషి చేయాలి తప్ప కక్ష సాధింపు ధోరణి అదే రకంగా సమస్య తీసుకువచ్చేటువంటి ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు వ్యక్తుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం కలెక్టర్ స్థానానికి ఉదాతనంగా ఉండదని అలాగే సహచర వివిధ డిపార్ట్మెంట్ల ఉద్యోగులను చిన్న చూపు చూడడం వారిని వేధింపులకు ఇబ్బందులకు గురి చేయడం వల్ల జిల్లా అభివృద్ధి కాదని ఆటంకంగా ఉంటుందని అన్ని తరగతుల ఉద్యోగులను కలుపుకొని పనిచేయాలని సూచించారు. కలెక్టర్ తన పద్ధతిలో వైఖరిలో మార్పు తీసుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. జనగామ జిల్లా అంటేనే చైతన్యంతో నిండుకుని ఉండదని ఇక్కడ నియంత స్వభావం ఆధిపత్య భావజాలంతో వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేటువంటి పరిస్థితి ఉండదని కలెక్టర్ పద్ధతి పై తిరుగుబాటు వస్తుందని హెచ్చరించారు. ఈసమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఇర్రి అహల్య, సాంబరాజు యాదగిరి, బొట్ల శేఖర్, సింగారపు రమేష్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, జోగు ప్రకాష్, సుంచు విజేందర్, ఎండి అజారుద్దీన్, పొత్కనూరి ఉపేందర్, బోడా నరేందర్, ఎండి షబానా, బెల్లంకొండ వెంకటేష్, చిట్యాల సోమన్న, గంగాపురం మహేందర్, మునిగల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధులు ఉషా మెహతా 106 వ జయంతి

### క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో రహస్య కాంగ్రెస్ రేడియో నిర్వహణ.

### బాల్యం, యవ్వనంలో గాంధీజీకి తోడు, నీడ.


### స్వాతంత్ర్యానంతరం విద్య, గాంధీయిజానికి అంకితం.

### పదవులనాశించని త్యాగమయి పద్మవిభూషణ్ డా.ఉషా మెహతా.




రామ్ మనోహర్ లోహియా తో ఉషా మెహతా

గాంధీజీ “ఆలోచనలు - తత్వం” అను అంశంపై విద్యార్థిగా పరిశోధనలు చేసి, ప్రజలకు ప్రబోధించి, దానినే జీవిత లక్ష్యంగానెంచి జీవితాంతం ఆచరించి ఆదర్శంగా నిలచిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, విద్యావేత్త, అసలుసిసలైన గాంధేయవాది ఉషా మెహతా 106 వ జయంతి సందర్భంగా స్ఫూర్తిదాయకమైన ఆమె జీవన గమనాన్ని మననం చేసుకుందాం.


జవహర్ లాల్ నెహ్రూతో ఉషా మెహతా

గుజరాత్ లోని సూరత్ సమీపంలో గల సరస్ గ్రామంలో గెలిబెన్ హరిప్రసాద్ దంపతులకు 1920 మార్చి 25న జన్మించారు. ఐదేండ్ల చిరుప్రాయంలోనే గాంధీజీని కలసిన ఉషా మెహతా పై గాంధీజీ జీవిత శైలి, నిరాడంబరత చెరగని ముద్ర వేసాయి. 1928 లో సైమన్ కమీషన్ కు వ్యతిరేకంగా సాగిన కవాతులో తన ఎనిమిదవ యేట ఈమె “నేను సైతం” అంటూ పాల్గొని స్వాతంత్ర్య పోరాటంలో తొలి అడుగులు వేసింది. ఈమె తండ్రి బ్రిటిష్ ఇండియా ప్రభుత్వంలో న్యాయమూర్తిగా ఉన్నంతకాలం కుమార్తెను ప్రోత్సహించలేకపోయినా 1930 లో ఆయన పదవీ విరమణ చేయడంతో ఆ ప్రతిబంధకం తొలగి మరింత స్వేచ్ఛ లభించింది. ఆడంబరాలకు, ఆర్భాటాలకు దూరంగా గాంధీజీ ఆలోచనలు, తత్వమే తన జీవన విధానంగా సాగిన ఉషా మెహతా, బ్రిటిష్ వారు నిషేధించిన పుస్తకాలు, వ్యాసాలను రహస్యంగా పంపిణీ చేసేవారు. విల్సన్ కళాశాలలో తత్వశాస్త్రంలో డిగ్రీ పూర్తిచేసి న్యాయశాస్త్రం చదువుతుండగా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనడానికి చదువుకు స్వస్తి పలికారు. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో సీనియర్ నాయకులు జైల్లో ఉంటే ఈమె రహస్య సమావేశాలనేర్పాటుచేసి ప్రసంగించేవారు. 1942 ఆగష్టు 14న రహస్య కాంగ్రెస్ రేడియో వ్యవస్థనేర్పాటు చేసి గాంధీజీ, పటేల్ వంటి నాయకుల ప్రసంగాల రికార్డులను ప్రసారం చేసి, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఈ కార్యక్రమంలో ఆమెకు ప్రముఖ సోషలిస్టు నాయకుడు రామ్ మనోహర్ లోహియా వంటి నాయకులు సహకరించారు. ఈ రేడియో కేంద్రాన్ని తరచూ మార్చుతూ బ్రిటిష్ వారి నుండి తప్పించుకొనేవారు. అయితే, 1942 నవంబర్ 12 న పోలీసులు ఈమెను అదుపులోకి తీసుకుని ఆరు నెలలు నిర్బంధించి న్యాయ స్థానములో ప్రవేశపెట్టారు. ఈమెకు నాలుగేళ్ల శిక్ష పడింది. బొంబాయి ప్రెసిడెన్సీ తాత్కాలిక ప్రభుత్వంలో హోం మంత్రిగా పనిచేసిన మురార్జీ దేశాయ్ ఈమెను ముందుగానే విడుదల చేయించారు. జైలు జీవితంలో ఈమె ఆరోగ్యం పాడవ్వడంతో 1947 ఆగష్టు 15 న భారతదేశ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనలేకపోయారు.

స్వాతంత్ర్య భారతావనిలో ఉషా మెహతా పదవీ రాజకీయాలకు దూరంగా ఉండి పి.హెచ్.డి పూర్తిచేసి విల్సన్ కళాశాలలో లెక్చరర్ గా, ప్రొఫెసర్ గా, పౌరశాస్త్రం - రాజనీతి శాస్త్రం విభాగాలకు అధిపతిగా పనిచేసి 1980 లో పదవీ విరమణ చేసారు.

గాంధీజీ ఆలోచనలు తత్వాలపై అనేక పుస్తకాలు, వ్యాసాలను రాసిన ఈమె గాంధీజీ స్మారక ట్రస్టు, గాంధీజీ శాంతి ఫౌండేషన్ (న్యూఢిల్లీ) లకు అధ్యక్షులుగా పనిచేసారు. భారతీయ విద్యా భవన్ నిర్వహణకు తోడ్పాటునందించారు. స్వాతంత్ర్య భారత అర్ధశతాబ్ది ఉత్సవాల ప్రణాళిక రూపకల్పనలో జాతీయస్థాయిలో ప్రముఖ భూమికను పోషించారు.

క్విట్ ఇండియా పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ జరిపే కార్యక్రమంలో ప్రతిఏటా ఈమె తప్పనిసరిగా పాల్గొనేవారు.

2000 సంవత్సరం ఆగస్టు 11 న తనువు చాలించిన ఈమె, దీనికి రెండు రోజుల ముందు జ్వరంతో బాధపడుతునే క్విట్ ఇండియా ఉద్యమం స్మృతి సమావేశంలో పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు.

ఉషా మెహతా స్వాతంత్ర్య పోరాటంలో నిర్వహించిన రహస్య కాంగ్రెస్ రేడియో ఇతివృత్తంగా హిందీలో “ ఏ వతన్ మేరె వతన్ (ఓ దేశమా, నా దేశమా) సినిమా కూడా విడుదలైంది. ఈమె సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం దేశ రెండవ అత్యున్నత పురస్కారం పద్మ విభూషణ్ తో ఉషా మెహతాను 1998లో సత్కరించారు.

భారతదేశ స్వాతంత్ర్యం, విద్య, గాంధేయతత్వం, విలువలకోసం జీవితాంతం కృషిచేసిన ఉషా మెహతా భారతీయులకు చిరస్మరణీయురాలు. ఆదర్శ వనిత.


సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే, ఝాన్సీ రెడ్డి

## సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 24(ప్రభాత ఉదయం):**

సీఎం రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి లు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి పనులు, ప్రజల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు గురించి ముఖ్యమంత్రితో చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరగా, ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎమ్ఎచ్ఓ

## క్షయవ్యాధి (టీబీ) నిర్మూలనలో ప్రజల అవగాహన అత్యంత ముఖ్యం

### జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ కె. మల్లికార్జునరావు

### జనగామ జిల్లా కేంద్రంలో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం అవగాహన ర్యాలీ

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 24(ప్రభాత ఉదయం):**

ప్రపంచ క్షయవ్యాధి (టీబీ) దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్క్ నుండి బస్ స్టాండ్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చౌరస్తా వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. కె. మల్లికార్జునరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలనలో ప్రజల అవగాహన అత్యంత ముఖ్యమని, ప్రారంభ దశలోనే గుర్తింపు, పూర్తి చికిత్స తీసుకోవడం ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నిర్ధారణ చికిత్స సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో క్షయవ్యాధి పట్ల చైతన్యం పెంపొందించి, సమయానికి వైద్య సేవలు పొందేలా ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్వహించబడిందన్నారు.. ఈ ర్యాలీలో టీబీ ప్రోగ్రాం ఆఫసర్ డాక్టర్ అశోక్ కుమార్, డా. శ్రీ హర్ష, డా. శ్యామ్ కుమార్, డా కమల్ హాసన్, డెమో ప్రభాకర్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, విద్యార్థులు, ప్రజలు పాల్గొని క్షయవ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు చికిత్సపై అవగాహన కల్పించారు.


బాక్సింగ్ లో రాష్ట్ర స్థాయి పథకాలు పొందిన విద్యార్థులు

## బాక్సింగ్‌లో రాష్ట్ర స్థాయిలో మెరిసిన సెయింట్ మేరీస్ ఆణిముత్యాలు

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 24(ప్రభాత ఉదయం)**

జనగామ జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు నందుగల సెయింట్ మేరీస్ విద్యార్థులు సోమవారం రంగారెడ్డి జిల్లా తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ వారు హైదరాబాదులోని షేక్పేట్ లోని మున్సిపల్ మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలో విద్యార్థులు వి. వివేక్, డి.సాయికుమార్, ఇ. శశికాంత్ 9వ తరగతి విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరచి బ్రౌంజ్ మెడల్స్ సాధించి జనగామ కీర్తిని రాష్ట్ర స్థాయిలో ఇనుమడింపజేశారు. విద్యార్థులు ఈ విజయానికి కారణమైన వ్యాయామ ఉపాధ్యాయులను పాఠశాల ప్రిన్సిపల్ జైమోన్ థామస్ అధ్యాపక బృందం అభినందించడంతోపాటు ముమ్మందు జాతీయస్థాయిలో జరిగే బాక్సింగ్ పోటీలోనూ జనగామ యశస్సును జాతీయస్థాయిలో నిలపాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జైమోన్ థామస్ , జైపాల్ రెడ్డి, పాఠశాల పిఆర్ఓ రంగరాజు ప్రసాద్, గుణ వర్ధన్, రాజు, నరసింహ్మా, హేమలత, రాజిరెడ్డి, ప్రమీల, నర్మద, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. “RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608